


ప్రైవేటుపరం ఆపకపోతే ప్రజా ఉద్యమం

ప్రజాశక్తి-చీపురుపల్లి

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపకపోతే ప్రజా ఉద్యమం తప్పదని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌తో కలసి ఆయన మాట్లాడారు. ప్రజా వైద్యం ప్రజల హక్కు అనే నినాదంతో బుధవారం అన్ని నియోజకవర్గాల్లో ప్రభుత్వ తీరుకు నిరసనగా భారీ ర్యాలీలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యతో పాటు పేదలకు అందుతున్న వైద్యాన్ని కూడా ప్రైవేటు పరం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రానికి మెడికల్ సీట్లు కేటాయిస్తే వద్దని చెప్పిన ఏకైక రాష్ట్ర ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని అన్నారు. 12న జరగనున్న ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలనికోరారు. సమావేశంలో వైసిపి నాయకులు మీసాల వరహాలనాయుడు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో స్టోన్ క్రషర్స్

జీవనోపాధి కోల్పోయిన వందలాది కార్మిక కుటుంబాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరంలోని స్టోన్ క్రషర్లు సంక్షోభంలోకి వెళ్లాయి. లావాదేవీలు తగ్గిపోవడంతో ఆయా క్రషర్ యాజమాన్యాల ఆదాయం తగ్గిపోవడంతోపాటు అందులో పనిచేస్తున్న వేలాది మంది కార్మిక కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నారు. రాయిల్టీ పేరిట ప్రభుత్వం మోపిన ఆర్థిక భారం మోయలేక ఎన్నో క్రషర్స్ మూతపడ్డాయి. కొందరు అత్తెసరు వేతనాలతో బతుకీడుస్తున్నారు.

పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలో గతంలో సుమారు వందకుపైగా స్టోన్ క్రషర్స్ ఉండేవి. ప్రస్తుతం 80వరకు స్టోన్ క్రషర్లు ఉన్నాయి. ఇవి కూడా సంక్షోభంలోకి వెళ్లాయి. వాస్తవానికి ఉమ్మడి విజయనగరం జిల్లాలో అత్యంత నాణ్యతగలిగిన స్టోన్ గనులు ఉన్నాయి. అందువల్ల మన రెండు జిల్లాలతోపాటు శ్రీకాకుళం, అటు ఒడిశాలోని రాయగడ జిల్లాకు కూడా రోడ్లు, భవనాలతోపాటు రైల్వే ట్రాక్ నిర్మాణాలకు అవసరమైన రాళ్లు ఇక్కడి నుంచి సరఫరా జరుగుతోంది. లోడింగ్, అన్‌లోడింగ్, రాయిని వివిధ పరిమాణాల్లో సైజుచేసే ప్రక్రియలో భాగంగా పని చేసేవారు, డ్రైవర్లు, సెక్యూరిటీ వంటి రూపాల్లో సుమారు వెయ్యిమందికిపైగా ఈ క్రషర్స్‌లో జీవనోపాధి పొందుతున్నారు. గనుల నిర్వహణ గతంలో వైసిపి ప్రభుత్వమే గుత్తపెట్టుబడి దారులకు అప్పగించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లోని స్టోన్ క్రషర్‌తోపాటు మాంగనీస్, క్వార్ట్జెట్ తదితర గనులన్నీ రాఘవ కనస్ట్రక్షన్స్ అనే కంపెనీ ఆదీనంలో నడుస్తున్నాయి. మైనింగ్ అధికారులు కేవలం లెక్కలు, జమాకే పరిమితం. ఇదే అదునుగా రాఘవ కనస్ట్రక్షన్స్ రాయిల్టీని ఇష్టారాజ్యంగా పెంచిందని స్టోన్ క్రషర్ల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణాలకు తగిన నిధులు కేటాయించకపోవడం, సాగునీటి ప్రాజెక్టులపైనా పెద్దగా శ్రద్ధ చూపకపోవడం, కనీసం ఇంటి నిర్మాణాలకు కూడా ముందుకు రాకపోవడంతో ఇసుక, సిమెంట్‌తోపాటు స్టోన్ క్రషర్ వినియోగం కూడా తగ్గిపోతోంది. గత ప్రభుత్వం చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, బల్కుమిల్కు సెంటర్లు, వెల్‌నెస్ సెంటర్ల పనులను అర్ధాంతరంగా నిలిపివేసింది. ఈ భవనాల నిర్మాణాలను ఉపాధి హామీ ద్వారా వచ్చే మెటీరియల్

అమ్మకాలు లేక ఆత్యం మైనింగ్‌లో నిల్వ ఉన్న పిక్క



కాంపొనెంట్ పనుల్లో ప్రాధాన్యతా క్రమంగా పెట్టిన సంగతి విధితమే. కూటమి వచ్చాక వాటిని నాన్ ప్రేయారిటీలో పెట్టింది. రోడ్లు, కాలువలు ప్రాధాన్యతలో ఉంచినట్టు ప్రకటించినప్పటికీ అందుకు తగ్గట్టు పనులు చేపట్టలేదు. మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో చేపట్టిన రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు ఒక్క విజయనగరం జిల్లాలోనే రూ.97.79కోట్ల మేర ప్రభుత్వ బకాయి ఉంది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. పైన పేర్కొన్న రకరకాల భవన నిర్మాణ పనులను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లడం లేదు. గడిచిన ఏడాదిన్నరలో కొత్తగా ఇళ్లు మంజూరు చేసిన దాఖలాలు లేవు. ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టులు, ఇతర నిర్మాణ పనులు కూడా ఏమీ చేపట్టలేదు. చివరికి ఆర్అండ్‌బి, జాతీయ రహదారులు అస్తవస్తంగా ఉన్నప్పటికీ వాటిని పూర్తిచేసేందుకు చొరవ చూపలేదు. మరోవైపు గడిచిన పదేళ్లలో స్టోన్ వ్యాపారంలో అత్యంత కీలకంగా ఉండే మూడవ రైల్వేలైను పనులు పూర్తికావచ్చాయి. ఫలితంగా క్రషర్ యాజమాన్యాలు తమ ఉత్పత్తిని అనివార్యంగా తగ్గించుకోవాల్సిన పరిస్థితి రావడంతో విజయనగరం జిల్లా వేపాడ మండలం వాయిలపాడులో ఐదు క్రషర్స్‌కుగాను మూడు (మహవీర, కోటేశ్వరరావు, ఆప్‌కాన్స్) మూతపడ్డాయి. అదే మండలం బొద్దాంలో ఆరింటికి మూడే నడుస్తున్నాయి. వీలుపర్తిలో రెండు క్రషర్లు దివాలా తీశాయి. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం చినగుడబ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆత్యం మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా ఉత్పతిని తగ్గించుకుంది. దీంతో, పది మంది కార్మికులు జీవనోపాధికి దూరం కావాల్సి వచ్చింది. ఆ చుట్టుపక్కల మరికొన్ని క్రషర్స్ మూతపడ్డాయి. జిల్లా వ్యాప్తంగా ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఈనేపథ్యంలో నిర్మాణ పనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాల్సివుంది. లేదంటే కంపెనీలతోపాటు అందులో పనిచేస్తున్న కార్మికులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఔను ఉత్పత్తి తగ్గించుకున్నాం

ఔను...! స్టోన్ క్రషర్స్ వ్యాపారం గతం మాదిరిగా లేదు. పెద్దగా కొనుగోలు ఆర్డర్లు లేకపోవడం వల్ల నిల్వలు పేరుకుపోతున్నాయి. మరోవైపు రాయిల్టీ మొదలుకొని అన్నీ మదుపులు కూడా పెరిగాయి. దీనివల్ల ఉత్పత్తి చాలా వరకు తగ్గించుకున్నాం. 90శాతం వరకూ వ్యాపారం తగ్గిపోవడంతో అందకనుగుణంగా కార్మికుల సంఖ్యను కూడా తగ్గించుకోవాల్సివచ్చింది.

నాగేశ్వరరావు, ఆత్యం మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, చినగుడబ

పెట్టుబడులు పెట్టే స్థాయికి ఎదగాలి

- కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌కు వర్చువల్‌గా సిఎం శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు, కలెక్టర్

ప్రజాశక్తి-రాజాం, వంగర

పెట్టుబడులకు ఆకర్షితులు కావడమే కాక పెట్టుబడులు పెట్టే స్థాయికి యువత ఎదగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రకాశం జిల్లా కనిగిరి నుండి వర్చువల్ గా రాష్ట్రంలో పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ముఖ్యమంత్రి చేశారు. అందులో భాగంగా వంగర మండలం అరసాడలో 102 కోట్ల రూపాయల పెట్టుబడితో ప్రారంభించనున్న కంప్రెసర్ బయోగ్యాస్ ప్లాంట్ కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. రాజాం తహశీల్దారు కార్యాలయం నుండి కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, రాజాం, విజయనగరం ఎమ్మెల్యేలు కోండ్రు మురళీమోహన్, అదితి గజపతి రాజు, పారిశ్రామికవేత్త పి.రామ్మోహన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో పారిశ్రామికవేత్త రామ్మోహన రావు ఇంటరాక్ట్ అయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ యువ పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అరసాడలో 13.82 ఎకరాల్లో నిర్మించనున్న బయోగ్యాస్ ప్లాంట్ ద్వారా 500 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. ఒక ఏడాది కాలంలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రామ్మోహన్ రావు ముఖ్యమంత్రితో మాట్లాడుతూ తాను ప్రారంభించబోయే బయోగ్యాస్ ప్లాంట్ వల్ల ప్రత్యక్షంగా 500 మందికి పరోక్షంగా 5000 మంది రైతులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కలిసి బయోగ్యాస్ ప్లాంట్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ జెడ్‌పిటిసి బొత్స వాసుదేవరావు నాయుడు, నాయకులు నంది సూర్య ప్రకాశరావు, గురవాణ నారాయణ రావు, కిమిడి అశోక్ కుమార్, పిన్నింటి మోహన రావు, సుమల వెంకట మన్మథరావు, లచ్చుభుక్త కష్ణమూర్తి, బవిరి శ్రీనుబాబు, జరజాణ నితిన్, జనసేన నాయకులు యు.పి రాజు, రమేష్, గెడ్డపు నీలకంఠం, నాగరాజు ఐచీశీఅవగపాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు, కలెక్టర్

రోడ్లపై చెత్త వేస్తే భారీ జరిమానా : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇష్టానుసారం రోడ్ల పక్కన డెబ్రిస్ వేసే వారిపట్ల కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. ఇలా డెబ్రిస్ వేసే వారిని సమీపంలోని సిసి కెమెరాల ద్వారా గుర్తించాలని సూచించారు. డెబ్రిస్ వేసినట్లు నిర్ధారణ అయినవారికి రూ.లక్షకు తక్కువ కాకుండా జరిమానా విధించాలని స్పష్టం చేశారు. జిల్లాలోని నగరపాలక, పురపాలక సంస్థలు, నగర పంచాయితీల అధికారులతో కలెక్టరేట్ లో మంగళవారం సమావేశం జరిగింది. ఆయా సంస్థల్లో పారిశుధ్యం, సిబ్బంది, వాహనాలు, చెత్త నిర్వహణ, తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, గృహ నిర్మాణం, అన్న క్యాంటీన్లు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. డెబ్రిస్ ను రోడ్ల ప్రక్కన పడేయడం వల్ల పర్యావరణానికి నష్టం కలగడమే కాకుండా, వాహనదారులకు సైతం ఇబ్బంది కలుగుతోందని చెప్పారు. పారిశుధ్య సిబ్బంది కూడా దీనిపై నిఘా ఉంచాలని సూచించారు. ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించాలని ఆదేశించారు.చెత్తను రీ సైక్లింగ్ చేసి, దాని నిర్వహణకు అవసరమైన ఆదాయాన్ని సంపాదించాలని సూచించారు. మురుగునీటి నిర్వహణ కోసం ఎస్‌టిపి ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సిపిఒ పి.బాలాజీ, పబ్లిక్ హెల్త్ ఇఇ టి.జ్యోతి, మున్సిపల్ కమిషనర్లు పి.నల్లనయ్య, అప్పలరాజు, రామలక్ష్మి, శ్రీనివాసరావు, జయరాం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

వంద శాతం రికవరీ ఉండాలి

డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్‌పాణి

ప్రజాశక్తి-విజయనగరంకోట

వెలుగు, మహిళా సమాఖ్య ద్వారా ఇస్తున్న రుణాల రికవరీ వందశాతం ఉండాలని డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి అన్నారు.అకౌంటెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు మంగళవారం డిఆర్‌డిఎ కార్యాలయంలో 'మన డబ్బులు..మన లెక్కలు' కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండల మహిళా సమైఖ్య నుంచి సామాజిక పెట్టుబడి నిధి లక్ష్యం ఆరు కోట్ల 64 లక్షల రూపాయలు అని, ఇప్పటివరకు 652 మహిళా సంఘాలకు ఐదు కోట్ల 41 లక్షల రూపాయలు వివిధ అవసరాల నిమిత్తం బయోమెట్రిక్ పద్ధతిలో రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. తీసుకున్న మొత్తాన్ని తొమ్మిది శాతం వడ్డీతో తిరిగి చెల్లించాలన్నారు ఈ తొమ్మిది శాతం వడ్డీలు ఆరు శాతం మండల సమైక్యలకు, మూడు శాతం గ్రామ సమైక్యలకు తిరిగి ఇస్తామని తెలిపారు. రికవరీ అయినటువంటి డబ్బులను రొటేషన్ పద్ధతిలో ఉంచాలన్నారు. మూడు నెలలకు ఒకసారి అంతర్గత ఆడిట్ నిర్వహించుకోవాలన్నారు. ఇకనుంచి వచ్చే ఆదాయాన్ని బట్టి రేటింగ్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిడి కె.సావిత్రి, డిపిఎంలు ఎ.చిరంజీవి, జె.లక్ష్మీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బ్యాంక్ యాజమానుల తీరుపై నిరసన

ప్రజాశక్తి-విజయనగరం కోట

దేశంలో వున్న ప్రైవేట్ బ్యాంకు యాజమాన్యాలు వారి ఉద్యోగుల పట్ల ప్రవర్తిస్తున్న తీరుకు వ్యతిరేకంగా ఎఐబిఇఎ, ఆలిండియా ప్రైవేటు బ్యాంకు యూనియన్స్ ఆధ్వర్యాన మంగళవారం ప్రైవేట్ బ్యాంకుల ముందు నిరసన కార్యక్రమాలు జరిగాయి. అందులో భాగంగా విజయనగరంలో లయిన్స్ క్లబ్ వద్దగల ఫెడరల్ బ్యాంక్ బ్రాంచి వద్ద విజయనగరం బ్యాంక్ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కమిటీ ప్రెసిడెంట్ బి వి ప్రసాద్, సెక్రటరీ మురళీ శ్రీనివాస్, కొటక్ మహీంద్ర బ్యాంకు నాయకులు మురళి, ఫెడరల్ బ్యాంక్ నాయకులు విష్ణు, కెవిబి బ్యాంక్ నాయకులు శర్మ , నాగభూషణరావు, రవి కుమార్ , హరి , మనోజ్ వర్మ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై కొరడా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనుమతిలేని, అనధికార నిర్మాణాలపై ప్రణాళిక అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. కమిషనర్ ఆదేశాలతో ప్రణాళిక అధికారులు, సిబ్బంది మంగళవారం పూల్ బాగ్ ప్రాంతంలోని ప్రేమ సమాజం వద్ద ఓ భవనం పై అంతస్తు నిర్మాణాన్ని అడ్డుకున్నారు. నిర్మాణ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ అనుమతి లేని అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని చెప్పారు. కార్యక్రమంలో టిపిఎస్ అనిత, ప్రణాళిక సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర క్రీడలకు 40 మంది సివిల్ సర్వీసు ఉద్యోగులు ఎంపిక


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించే క్రీడా పోటీలకు జిల్లా నుంచి 40 మంది ఎంపికయ్యారు. మంగళవారం స్థానిక విజ్జి మైదానంలో జరిగిన ఎంపిక ప్రక్రియలో పంచాయతీరాజ్, రూరల్ వాటర్ వర్క్స్, విద్యా శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. వీరికి థ్లెటిక్స్, పరుగు పందెం,లాంగ్ జంప్, బాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహించారు. రాష్ట్ర పోటీలకు 40 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా క్రీడా శాఖ అధికారి ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు.

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 17,18, 19 తేదీల్లో విశాఖపట్టణం గీతం యూనివర్సిటీలో జరుగునున్న టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి క్రీడాకారుల ఎంపిక ఆ అసోషియేషన్ ఆధ్వర్యంలో గరివిడిలో జరిగింది. కోరుకొండ లో గల ది వైజాగ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఎం.జ్ఞాన దీప్, ఎల్.హరీష్ కుమార్ ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ సీతయ్య, డైరెక్టరు టి.వీరాస్వామి ,ప్రిన్సిపాల్ బి.లక్ష్మణమూర్తి అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్, డైరెక్టర్

పనికి తగ్గ వేతనం కోసం ఉద్యమం

- ఎపి మున్సిపల్. వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు
- ఉత్సాహంగా జిల్లా మహాసభ
- 17 మందితో నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా 4 వ మహాసభ మంగళవారం స్థానిక ఎన్‌పిఆర్ భవన్‌లో ఉత్సాహంగా జరిగింది. ముందుగా యూనియన్ జెండాను సీనియర్ నాయకులు పి.శంకరరావు జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభనుద్దేశించి యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఊరుకుటి రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు బతుకుల్లో మార్పు లేదన్నారు. కార్మికులకు రావాల్సిన హక్కులు ఇవ్వడంలోను, కార్మికుల ఆరోగ్యాలు కాపాడే విషయంలోను ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పిన సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఒకే రకమైన పనికి ఒకేరకమైన వేతనం ఇవ్వాలన్నారు. చనిపోయిన, రిటైర్మెంట్ అయిన వారి స్థాయిలో ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జీవో 96 అమలు చేయాలని, లేని యెడల మరో పోరాటానికి కార్మికులు సిద్ధం అవుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె సురేష్, టి వి రమణ మాట్లాడారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను మహాసభలో ఆమోదించారు. యూనియన్ నాయకులు పి.శంకరరావు, ఎ.జగన్మోహనరావు, బొగ్గు భాస్కరరావు, టి.లక్ష్మి, జి.గౌరీ, బంగారు.లక్ష్మి, శ్రామిక మహిళా సంఘం నాయకులు బి.సుధారాణి, అన్ని పురపాలక సంఘాల నుంచి కార్మికులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న యూనియన్ నాయకులు

17 మందితో నూతన కమిటీ ఎన్నిక

మహాసభ సందర్భంగా ఎపి మున్సిపల్. వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గం 17మందితో ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా గౌరవాధ్యక్షులుగా పి.శంకర్రావు, అధ్యక్షులుగా బి.భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎ.జగన్మోహన్‌రావు, కోశాధికారిగా బి.హరిబాబు, సహాయ కార్యదర్శులుగా జి.కుమారి, పి.కనకరాజు, ఉపాధ్యక్షులుగా జి.గౌరి, టి.బాబురావు ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా ఎ.రజని, జి.రమా, బి.మోహన్, కె.ఆదినారాయణ, ఎన్.చిన్నబాబు, బి.లక్ష్మి, జె.ఏడుకొండలు, జి.భోగమ్మ, ఇంజినీరింగ్ విభాగం నుంచి కో ఆప్షన్ సభ్యులతో కలిపి 17 మంది ఎన్నికయ్యారు.

పిఎసిఎస్‌ల పటిష్టతకు కృషి : డిసిసిబి చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, పిఎసిఎస్‌లను బలోపేతం చేయాలని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. జిల్లా పరిధిలో నూతనంగా నియమితులైన 46 పిఎసిఎస్‌ల అధ్యక్షులకు మంగళవారం ఎస్‌విఎన్ లేక్ ప్యాలెస్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ పిఎసిఎస్ అధ్యక్షుల విధులు, అధికారాలు, బాధ్యతలు తెలుసుకోవాలన్నారు. రాబోయే కాలంలో వ్యవస్థ బలోపేతానికి కార్యవర్గాలు, అధికారులు కచ్చితమైన ప్రణాళికతో పటిష్టం చేసే విధంగా ఉండాలని సూచించారు. రైతులకు తక్కువ వడ్డీ రేటుతో రుణాలు మంజూరు చేస్తున్నామని, సొసైటీల ద్వారా జిల్లాలో రైతులకు లబ్ది చేకూరేలా చూడాలని, సొసైటీల బలోపేతానికి పటిష్టమైన వ్యాపార ప్రణాళికతో కార్యాచరణ రూపొందించుకోవాలని అన్నారు. డిసిసిబిలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయటం ద్వారా అధిక వడ్డీ వస్తుందని, ఇప్పటికి కేవలం 4 నెలల కాలంలో 25 కోట్ల రూపాయలకు పైగా డిపాజిట్లు సాధించామని తెలిపారు. అప్పు తీసుకుని తిరిగి కట్టని వ్యక్తులను ఉపేక్షించబోమని, అలాంటి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. సొసైటీల నుండి వచ్చిన వినతులను,సమస్యలను త్వరిత గతిన పరిష్కరించే దిశగా కషి చేస్తాం అన్నారు. కార్యక్రమంలో విజయనగరం డిసిఒ పి.రమేష్, డిసిసిబి సిఇఒ సిహెచ్.ఉమా మహేశ్వరరావు, డిఆర్ ఈశ్వరరావు, ఆప్కోబ్ సిటిటి డైరెక్టర్ జి.సత్యనారాయణ రాజు, రిటైర్డ్ డిసిఒ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



పిఎసిఎస్ అధ్యక్షుల శిక్షణలో మాట్లాడుతున్న డిసిసిబి చైర్మన్ నాగార్జున

మహనీయుడు అబుల్ కలాం ఆజాద్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కోట, కంటోన్మెంట్

భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని వక్తలు కొనియాడారు. మౌలానా జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని, జాతీయ విద్యా దినోత్సవాన్ని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా అబుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మైనారిటీ వర్గాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యార్థులకు బహుమతి ప్రదానం చేసి సత్కరించారు. ఇన్ఛార్జి జాయింట్ కలెక్టర్ ఎస్.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ, అబుల్ కలాం గొప్పదనాన్ని కొనియాడారు.తూర్పుకాపు ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి మాట్లాడుతూ, అబుల్ కలాం గొప్ప స్వాతంత్ర్య సమరయోధులే కాకుండా, గొప్ప రచయితగా, జర్నలిస్టుగా, న్యాయవాదిగా గుర్తింపు పొందారని చెప్పారు.డిఇఒ యు.మాణిక్యం నాయుడు, జిల్లా మైనారిటి సంక్షేమాధికారి షేక్ మహబూబ్ షరీఫ్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎన్.వెంకటేశ్వ్రావు, వివిధ మైనారిటీ సంఘాల ప్రతినిధులు ఖాదర్ భాషా, జస్వీర్ సింగ్, ఆర్.ఎస్.జాన్, ఖలీల్, అనురాధ బేగం తదితరులు మాట్లాడారు.

పోలీసుశాఖ ఆధ్వర్యాన

జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో మైనారిటీస్ వెల్ఫేర్ డే ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అబుల్ కలాం అజాద్ చిత్ర పటానికి ఎస్‌పి ఎఆర్ దామోదర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. తొలి విద్యాశాఖామంత్రిగా మౌలానా అబుల్ కలాం అజాద్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, డిపిఒ ఎఒ పి.శ్రీనివాసరావు, పలువురు సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యతోనే సమాజాభివృద్ధి

విద్య ద్వారానే సమాజ అభివృద్ధి జరుగుతుందని తెలియజేసిన మహనీయుడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అని డిసిసి అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ అన్నారు. మంగళవారం కలాం జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. అబ్దుల్ కలాం చిత్రపటానికి విద్యాసాగర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కరిం, షరీఫ్, రెహమాన్, సమీర్, శ్రీనివాస్, మోహన్, డాక్టర్ తిరుపతి, బూర ఐశ్వర్య, బంగారునాయుడు, సుంకర గణేష్, సూరి బాబు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబానికి 'చేయూత'

ప్రజాశక్తి -కంటోన్మెంట్

పోలీసుశాఖలో పని చేస్తూ మరణించిన ఎస్ఐ వి.శ్రీనివాసరావు, అనారోగ్యంతో మరణించిన కానిస్టేబులు నాగభూషణం కుటుంబాలకు 'చేయూత" మరియు కో-ఆపరేటివ్ చెక్ లను ఎస్‌పి ఎఆర్ దామోదర్ మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. పూసపాటిరేగ పోలీసు స్టేషనులో ఎస్ఐగా పని చేస్తూ, విజయవాడలో బందోబస్తు విధులు నిర్వహిస్తూ, ప్రమాదవసాత్తు మరణించిన వి.శ్రీనివాసరావు కుమారుడు పరమేశ్వర పవన్ కుమార్, కుమార్తె అంబిక అన్నపూర్ణేశ్వరి లకు రూ. 1,48,000 చెక్ ను ఎస్‌పి అందజేసారు. బాడంగి పోలీసు స్టేషనులో కానిస్టేబులుగా పని చేస్తూ, అనారోగ్య కారణాలతో మరణించిన నాగభూషణరావు సతీమణి రెడ్డి ధనలక్ష్మికి పోలీసు ఉద్యోగుల కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో దాచుకున్న రూ.1,18,794 చెక్‌ను, ఫ్యూనరల్స్ నిమిత్తం మరో రూ.30వేలు చెక్ ను ఎస్‌పి అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిపిఒ ఎఒ పి.శ్రీనివాసరావు, అడ్‌హాక్‌కమిటీ అధ్యక్షులు కె..శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంచాయతీ రోడ్లపై సమగ్ర నివేదిక : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలోని పంచాయతీరాజ్ రహదారులపై వారం రోజుల్లో సమగ్ర నివేదికను ఇవ్వాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టరేట్లో మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. ఆయా శాఖల్లో అమలు జరుగుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాపై సమీక్షించారు. రక్షిత మంచినీటి పథకాలు, సరఫరా, తాగునీటి పథకాల నిర్మాణం, త్రాగునీటి పరీక్షలు, జలజీవన్ మిషన్ తదితర అంశాలను ఆరా తీశారు. కుళాయిల ద్వారా సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న రహదారులు, తాగు నీటి పథకాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో సిపిఒ పి.బాలాజీ, పిఆర్ ఎస్ఇ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎడి కవిత, పలువురు ఇఇలు, డిఇలు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తయారు చేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారు చేయాలని ఎంపిపి సింహాద్రి అప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కిషోర్ కుమార్ అధ్యక్షతన ఉల్లాస్ వయోజన విద్య శిక్షణా తరగతులను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో విద్యా వాలంటీర్‌ను నియమించి నిరక్ష్యరాస్యులను గుర్తించి వారికి విద్య నేర్పించాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు బండి అప్పలనాయుడు, మిత్తి రెడ్డి రమేష్ నాయుడు, ఎంఇఒ వెంకట్రావు, ఇఒపిఆర్‌డి శివాజీ, వయోజన విద్యా కోఆర్డినేటర్ జయరాం, ఎంసిఒ గోవింద్, ఎపిఒ రమణ తదితరులు పాల్గొన్నారు

జెఎన్‌టియుజివిలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సాంకేతిక ఆవిష్కరణల ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల బలోపేతంపై జెఎన్‌టియు జివి నిర్వహణలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. సాంకేతిక ఆవిష్కరణల ద్వారా స్టార్టప్స్ బలోపేతం, మేధసంపత్తి హక్కులు, సాంకేతిక బదిలీ, వాణిజ్యీకరణ అనే అంశంపై ఈ వర్క్‌షాప్‌ను జరిగింది. ముఖ్య అతిథిగా వైస్ ఛాన్సలర్ వివి సుబ్బారావు, మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తల్లో మేధసంపత్తి హక్కుల పట్ల అవగాహన పెంపు, సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పరిశోధనా సంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడం దీని ముఖ్య ఉద్దేశమని అన్నారు.

ప్రభుత్వ సంస్కృత కళాశాలలో విద్యా దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ సంస్కృత కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్ధన నాయుడు జాతీయ విద్యా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. భారతదేశపు మొదటి విద్యా మంత్రి, మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్య ద్వారా సమాజ అభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి ఆయన అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పైడిమాంబ యూత్ సొసైటీ ఆధ్వర్యాన జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరంకోట

రెడ్ క్రాస్ సమీపంలోని మై భారత్ కార్యాలయంలో పైడిమాంబ యూత్ సొసైటీ, ఎన్‌జిఒ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీరామమూర్తి, వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కుసుమంచి సుబ్బారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరామమూర్తి మాట్లాడుతూ పైడిమాంబ యూత్ సొసైటీ ఫౌండర్ ప్రవల్లిక , సభ్యులు కుమార్ పట్నాయక్ ఇటువంటి జాబ్‌మేళా నిర్వహించడం అభినందనయామని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కోరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

మండల అభివృద్ధికి కృషి చేయాలి

భోగాపురం: మండలాన్ని ప్రగతి పథంలో పరుగులు పెట్టేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎపి మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎవి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం భోగాపురం ప్రత్యేకాధికారిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల పరిషత్, రెవెన్యూ అధికారులు సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందే మండలాల్లో భోగాపురం ఒకటని, ఒకవైపు విమానాశ్రయంతో కోస్టల్ కారిడార్, మరిన్ని సంస్థలు రానున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు రాష్ట్ర మంత్రి వర్గంతో పాటు ఉన్నతాధికారుల పర్యటన ఉంటుందని సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని సూచించారు. అనంతరం భోగాపురం 1,2 సచివాలయాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమణమ్మ, ఎంపిడిఒ స్వరూపారాణి, మండల స్థాయి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

115 పరుగులతో అదరగొట్టిన విగ్నేష్

తెర్లాం: మండలంలోని ఎస్.బూర్జవలస గ్రామానికి చెందిన పైల విగ్నేష్ అండర్–19 క్రికెట్ పోటీల్లో 115 పరుగులతో అదరగొట్టాడు. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం జిల్లా జట్ల మధ్య జరిగిన అండర్ 19 క్రికెట్‌లో 115 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. గ్రామస్థాయి నుంచి ఇంటర్నేషనల్‌కు ఎంపికవడంపై విగ్నేష్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఇళ్లులేని వారికి గృహ వసతి

మెరకముడిదాం: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం 2.0 కింద ఇళ్లు లేని పేదలకు గృహ వసతి ద్వారా సర్వే చేసి అర్హులకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని హౌసింగ్ ఎఇ బి.మురళి తెలిపారు. ఇళ్లు లేని లబ్ధిదారులను గుర్తించేందుకు మంగళవారం నుంచి సర్వే ప్రారంభించామన్నారు. ఈ సర్వే ఈనెల 30 వరకు నిర్వహిస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులు గ్రామ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, మండల గృహ నిర్మాణ శాఖ ఎఇ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నివాస స్థల ధ్రువపత్రం, రేషన్ కార్డు, భార్య, భర్త బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలు, భార్య, భర్త ఆధార్ కార్డు జిరాక్స్, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ జాబ్ కార్డు, వార్షిక ఆదాయ ధ్రువపత్రం, మొబైల్ నెంబర్ వివరాలు తప్పనిసరిగా పొందుపరచాలని ఆయన అన్నారు.

రోడ్డు పరిశీలన

వేపాడ: మండలంలోని సిరతపాలెం జంక్షన్ నుంచి ఎం.సింగవరం, బానాది, బల్లంకి గ్రామాల మీదుగా ఆనందపురం జంక్షన్ వరకు గల ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్‌ను తొలగించి, మరమ్మతుకు గురైన రోడ్డును బాగుచేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆదేశం మేరకు ఆర్ అండ్‌బి జెఇ ఆర్ స్వామి నాయుడు మంగళవారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా బానాది ఎంపిటిసి గొంప తులసీ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్ తొలగించి ప్యాచ్ వర్క్ పనులు చేపట్టి రాకపోకలకు ఆటంకం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని జెఇని కోరారు. ఈ పరిశీలనలో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ యాజమాన్య హక్కులు మంజూరు

రామభద్రపురం: గ్రామ సభల ఆధ్వర్యంలో గృహ యాజమాన్య హక్కులు మంజూరు చేస్తున్నట్లు ఎంపిడిఒ రత్నం తెలిపారు. మంగళవారం దుప్పలపూడి గ్రామంలో సర్పంచ్ భాస్కరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. దీని ద్వారా ఇంటి యాజమాన్యం హక్కులు (ప్రాపర్టీ కార్డులు) మంజూరు కోసం స్వామిత్వా సర్వేలో గుర్తించిన ఇంటి యజమానులు పేర్లు, వారి ఆస్థి వివరాలు చదివి వినిపించారు. ప్రాపర్టీ పార్సెల్ మ్యాప్స్‌ను సభలో ప్రదర్శించి ప్రజల అంగీకారాన్ని స్వీకరించారు. ప్రతీ గ్రామంలో ఈ సర్వే ఆధారంగా ప్రాపర్టీ కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వెంకటరమణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

మెరకముడిదాం: మండలంలోని చినబంటుపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆల్తి రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాంబాబు మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజున ఏటా నవంబరు 11న దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటారని గుర్తు చేశారు. దీన్నే రాష్ట్రీయ శిక్ష దివస్ అని కూడా పిలుస్తారన్నారు. దేశంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ పుట్టినరోజున జాతీయ విద్యా దినోత్సవంగా పాటిస్తారన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.రఘునాథరాజు, జి.అప్పలనాయుడు, బి.ప్రసన్న కుమారి, బి.శ్రీదేవి, కె.సూర్యకుమారి, గౌరీశ్వరరావు, కబీర్ పాల్గొన్నారు.

ఆరికతోట విద్యార్థులకు పతకాలు

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పతకాలు సాధించారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో కాకినాడలో జరిగిన అండర్ –17 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో 9వ తరగతి చదువుతున్న ప్రేమసాగర్ 60 కేజీలు, కర్రి శిరీష 52 కేజీల్లో కాంస్య పతకాలు సాధించారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బొత్స రత్నకిశోర్ తెలిపారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్‌లో పతకం

రేగిడి: మండలంలోని లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎల్.రజిని రాష్ట్రస్థాయి స్విమ్మింగ్‌లో బ్యాక్ స్ట్రోక్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. మంగళవారం ప్రధానోపాధ్యాయులు డి. కృష్ణారావు,ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ఈ నెల 8 నుండి 9వ తేదీ వరకు ఆక్వా స్విమ్మింగ్ పూల్, విశాఖపట్నంలో జరిగిన అండర్ 19లో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీలలో రజిని మెడల్ సాధించడంతో పాఠశాలకు గుర్తింపు లభించిందని అభినందించారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణికి సన్మానం

చీపురుపల్లి: ఇటీవల పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన సాకేటి రేణుక కళ్యాణిని స్థానిక వైసిపి నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఇప్పిలి అనంతం, మీసాల వరహాలనాయుడులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆంధ్రా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఈ నెల 2న విశాఖపట్నంలో ఎల్‌బి కళాశాలలో జరిగిన ఇంటర్ కాలిగేట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో పవర్ లిఫ్టింగ్‌లో రేణుక కళ్యాణి గోల్డ్ మెడల్ సాధించింది. రేణుకకళ్యాణి చీపురుపల్లి ఎస్‌డిఎస్ కళాశాలలో తృతీయ సంవత్సరం బియస్సి కంప్యూటర్ సైన్స్ చదువుతోంది.

సాగు భూములను రైతులకు ఇప్పించండి

కొత్త వలస: వంశపారంపర్యంగా సాగు చేసుకుంటున్న భూములను రైతులకు ఇప్పించాలని, విశాఖ రాయపూర్ జాతీయ రహదారిలో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ మంగళవారం తహశీల్దార్ పి.అప్పలరాజుకు చిన్నపాలెం రైతు సంఘం గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తామరపు అప్పారావు, ఎం.దేముడు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నపాలెం రెవెన్యూ పరిధిలో 150 సంవత్సరాల నుంచి భూమిని నమ్ముకొని వ్యవసాయం చేస్తూ జీవనోపాధి పొందుతున్న రైతుల పేరును తొలగించి కార్పొరేట్ కంపెనీలు పేరుతో భూ రికార్డులు మార్చారని చెప్పారు. ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్న భూములు కూడా రైతుల పేర్లను తొలగించి కార్పొరేట్ కంపెనీలు పేర్లతో రికార్డులు మార్చారని తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. రీ సర్వేలో భాగంగా అనుభవంలో ఉన్న రైతుల పేరిట సాగు భూమిని నమోదు చేసి చట్టపరమైన యాజమాన్య హక్కు కల్పించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నిపాలెం రెవెన్యూ పరిధిలోని రైతులు సిమ్మ కన్నయ్య, ఎస్ సుందర్రావు, బివిఎస్‌ఎన్ మూర్తి, పి.శ్రీను, ఎస్.కె సయ్యద్, సన్యాసిరావు పాల్గొన్నారు.

ఉచిత ఉపకరణాలకు గుర్తింపు శిబిరం


మెరకముడిదాం: ఈ నెల 13న మండలంలో చదువుతున్న వికలాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల కోసం గుర్తింపు శిబిరాన్ని గరివిడి మండలంలోని కొండపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని ఎంఇఒలు యం చంద్రశేఖర్, ధర్మశ్రీ తెలిపారు. మండలానికి చెందిన 6 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల వికలాంగ విద్యార్థులు ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీకి ఈ వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదవకాశాన్ని వికలాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరి కొన్ని వివరా లుకు 9666208001, 9908061951 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

గంట్యాడ : మండలంలోని కరకవలస ఎస్‌సి కాలనీలో సిందే తేజ (29) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ సాయి కృష్ణ మంగళవారం తెలిపారు. మృతుని పిన్ని సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలన చేయగా తన ఇంట్లో ఒంటరిగా ఉంటున్న తేజ ఐరన్ రాడ్డుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఇంట్లో దుర్వాసన రావడం గ్రహించి మేనత్త చూడగా మృతి చెంది ఉన్నాడని తల్లి అక్కమ్మ ముంబైలో ఉంటున్నారని తెలిపారు. కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు

నిలిచిన అభివృద్ధి పనులు

9వ రోజుకు చేరిన కాంట్రాక్టర్ల ఆందోళన



కార్పొరేషన్ కార్యాలయంలో నిలిచిపోయిన ఇన్నోవేషన్ పనులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తమ బకాయి బిల్లులు చెల్లించాలని నగరంలో కాంట్రాక్టర్లు చేపట్టిన ఆందోళన మంగళవారం 9వ రోజుకు చేరుకుంది. అయినా అధికారుల్లోను, ప్రజాప్రతినిధుల్లోనూ చలనం లేకపోవడంతో పోరాటాన్ని ఉధృతం చేసే దిశగా కాంట్రాక్టర్లు కదులుతున్నారు. వీరి ఆందోళన ఫలితంగా నగరంలో సుమారుగా రెండు కోట్లతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. మరో వైపు స్థానిక సంస్థల ఎన్నికల దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇటీవల రోడ్లు, కాలువలు వంటి మౌలిక సదుపాయాలు కల్పనకు డివిజన్‌కు రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. వీటితో పాటు రూ.40లక్షలతో చేపట్టిన టౌన్ ప్లానింగ్ కార్యాలయం ఇన్నోవేషన్ పని నిలిచిపోయింది. జనవరి నాటికి ఈ పనులన్నీ పూర్తి చేసేందుకు పాలకులు ఇంజినీరింగ్ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. గత రెండేళ్లుగా అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉండిపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. కూటమి ప్రభుత్వం 16 నెలల పాలనా కాలంలో అభివృద్ధి పనులకు సంబంధించి రూ.కోట్లలోనే బిల్లుల బకాయిలు పేరుకుపోవడంతో కాంట్రాక్టర్ల పాలిట గుదిబండలా మారింది. దీంతో తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతు ఆందోళన చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన ఏడాది తర్వాత నగరంలోని 50 డివిజన్ల పరిధిలో రూ.11 కోట్లతో స్థానిక ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేసిన పనులు పూర్తి చేయాల్సి ఉంది. అప్పట్లో కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో కమిషనర్ సహా ఇంజినీరింగ్ అధి కారులంతా వారందరినీ ఒప్పించి టెండర్లు వేయించారు.కొన్ని పనులు చేయించేసారని ఆ పనులు డబ్బులు కూడా ఇవ్వలేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.మొత్తంగా రూ.16 కోట్ల అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని కాంట్రా క్టర్లు చెబుతుండగా అందులో రూ.8 కోట్లకు సంబంధించిన బిల్లులు మాత్రమే నిధి పోర్టల్‌లో అధికారులు అప్లోడ్ చేసినట్లు తెలుస్తుంది. మరో రూ.8 కోట్ల మేర బిల్లులు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాల్సి ఉందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఈనెల 3నుంచి ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లు ఇప్పటికీ మూడు సార్లు కమిషనర్, అధికారులతో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్,స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. రెండేళ్లలో గడిచిన రూ.16 కోట్ల విలువైన అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

ట్రేడ్స్ విధానం అమలు చేయాలని డిమాండ్

కోట్ల రూపాయల పెండింగ్ బిల్లుల సమస్య పరి ష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా ట్రేడ్స్ విధానాన్ని తీసు కువస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే ఇక్కడి కమిషనర్ మాత్రం ఆ విధానం అమలుకు ఆమోదయోగ్యంగా లేరని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. వాస్తవానికి ఈ విధానం ద్వారా థర్డ్ పార్టీకి చెందిన ఓ సంస్థ పెండింగ్ బిల్లులను కాంట్రాక్ట ర్లకు చెల్లించేలా అధికారులతో ఒప్పందం కుదుర్చు కుంటుంది. ఈ విధానం విశాఖ, రాజమండ్రి తదితర కార్పొరేషన్లో అమలు చేస్తున్నప్పటికీ విజయనగరంలో మాత్రం అమలుకావడం లేదు.

న్యాయం జరిగే వరకు సమ్మె కొనసాగిస్తాం

బిల్లులు చెల్లించి న్యాయం చేసే వరకు సమ్మె జరుగుతుంది. బిల్లులు చెల్లించే వరకు అభివృద్ధి పనులు చేసేది లేదు. అప్పులు చేసి మరీ పనులు చేశాం. బిల్లులు చెల్లింపులు జరగకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు కూడా చెల్లించుకోలేని దుస్థి తిలో ఉన్నాం. ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించాలి.

అశోక్, బంగార్రాజు, రాజ్ కుమార్‌లు
మున్సిపల్ కాంట్రాక్టర్లు వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

పలు మండలాల టిడిపి అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస, వేపాడ, ఎల్.కోట టిడిపి మండల అధ్యక్షులను అధిష్టానం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అధ్యక్ష, కార్యదర్శులు ఐవిఆర్‌ఎస్ కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయన సేకరణ చేసి నియమించినట్లు ఎమ్మెల్మే కోళ్ల లలితకుమారి తెలిపారు. కొత్తవలస మండల అధ్యక్షులుగా కోళ్ల వెంకట రమణ, ప్రధాన కార్యదర్శిగా కనకాల శివ, లక్కవరపుకోట మండల అధ్యక్షులుగా కరెడ్ల ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా గండి శ్రీరామ్మూర్తి నియమితులైనట్లు ఆమె తెలిపారు.

అధ్యక్ష, కార్యదర్శుల కొనసాగింపు

వేపాడ: మండలంలో ప్రజాభిప్రాయ సేకరణ మేరకు టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు గొంప వెంకటరావు, కొంట్యాడ రమణమూర్తి కొనసాగిస్తున్నట్లు సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఉత్తర్వులు జారీ చేశారు. వారిద్దరినీ కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చినందుకు గాను సిఎం చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు, ఎమ్‌పి శ్రీభరత్‌కు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కృతజ్ఞతలు తెలిపారు.

కల్వర్టు నిర్మాణానికి పరిశీలన

వేపాడ: విశాఖపట్నం జివిఎంసి ఇఇ మురళీ కృష్ణ మండలంలోని కెఆర్‌పేట వద్ద రైవాడ కాలువను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెఆర్‌పేట కాలువపై కల్వర్టు నిర్మాణానికి రూ.91 లక్షలు, బల్లంకి కాలువ వద్ద కల్వర్టు నిర్మాణానికి రూ.43.65 లక్షలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. పనులు ప్రారంభించడానికి కాలువలో వెళుతున్న నీరు డైవర్షన్ చేయడానికి పరిశీలన చేశామన్నారు. ఈ పరిశీలనలో డిఇఎఇ వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

భోగాపురం: మండలంలోని రెడ్డికంచేరులో మంగళవారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సర్పంచ్ బైరెడ్డి రమణరెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని సంతకాలు చేశారు. రావాడ గ్రామంలో కూడా వైస్ ఎంపిపి రావాడ బాబు ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు ఉప్పాడ సూర్య నారాయణ రెడ్డి, సర్పంచ్ అప్పురుబుక్త పైడినాయుడు, నెల్లిమర్ల సోషల్ మీడియా కన్వీనర్ సీరపు వంశీరెడ్డి, సీరపు దుర్గయ్య రెడ్డి, బైరెడ్డి దుర్గయ్యరెడ్డి బొల్లింకల చిన్నయ్యరెడ్డి పాల్గొన్నారు.

గర్భధారణ ఇంజక్షన్లను వేయించాలి: జెడి

ప్రజాశక్తి- గంట్యాడ

ప్రతీ రైతు పాడి పశువులకు గర్భధారణ ఇంజక్షన్లను వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం గింజేరు గ్రామంలోని మంగళవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పాల ఉత్పత్తిలో జిల్లా 5వ స్థానంలో ఉందన్నారు. పశువులు పునరుత్పత్తి ముఖ్యమని పశువుల ఆరోగ్యంగా ఉండడం ఎంతో అవసరమని అన్నారు. పశువులకు ముద్దశర్మ వ్యాధి నివారణ టీకాలను వేయించాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాస విత్తనాలను 100శాతం ఇస్తున్నామన్నారు. ఎపిఎల్‌డిఎ డాక్టర్ ఎంవి జగదీష్ కుమార్ రాష్ట్రయ గోకుల్ మిషన్ ద్వారా రైతులకు అందించిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ రెడ్డి కృష్ణ, డాక్టర్ లలిత, డాక్టర్ అంజలి, సంచార పశు వైద్యశాల 1962 ఆర్ కావ్య, వేపాడ మండలం డాక్టర్ ఎం.అనిల్ కుమార్, డాక్టర్ సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని రావాడలో మంగళవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుగర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పశుసంపద రైతుల ఆర్థిక స్థితిని బలపరచడంలో కీలక పాత్ర పోషిస్తోందని, ప్రభుత్వ పథకాల ద్వారా పశువైద్య సేవలను మరింత గ్రామస్థాయిలో విస్తరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. శిబిరంలో 145 పశువులకు గర్భకోశ వ్యాధులు చికత్సలు చేయగా 45 పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. 12 పశువులకు పేడా, రక్త పరీక్షలు, నిర్వహించారు. అదనంగా, పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ సూర్యనారాయణ మూర్తి రాజు, రావాడ సర్పంచ్ అప్పురభుక్త పైడి నాయుడు, మట్టా అయ్యప్ప రెడ్డి, వందనాల రమణ, కర్రోతు శ్రీను, వాసుదేవరాజు, రాధాకృష్ణ, విజయనగరం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎన్. దామోదరరావు, పశుగణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.రాధాకృష్ణ, భోగాపురం సహాయ సంచాలకుడు డాక్టర్ ఉమాశంకర్ మహాపాత్రో, అక్కివరం, ముంజేరు, పోలిపల్లి పశువైద్యాధికారులు శ్రీకాంత్, రామరాజు, కమలకుమారి, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని ముకుందపురంలో మంగళవారం పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ సి. హెచ్.సత్యప్రకాష్ మాట్లాడుతూ పశుపోషకులు గర్భకోశ వ్యాధులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సంతానోత్పత్తికి పనికిరాని పాడిపశువులను వైద్యుల సలహాతో చికిత్స చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆడదూడల ఉత్పత్తి పథకం ద్వారా 90 శాతం ఆడదూడలు పుట్టే అవకాశం ఉందని, రూ.300 విలువైన ఇంజెక్షన్ సబ్సిడీపై రూ.150కే అందుబాటులో ఉందని తెలిపారు. శిబిరంలో 68 పశువులకు చికిత్సలు, రూ.20 వేల విలువైన మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ జానకిరామ్, పశుసంవర్ధక సిబ్బంది రమణ, సౌమ్య, సంతోష్, పాడి రైతులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా మత్స్యకార సొసైటీ ఎన్నిక



నియామక పత్రాన్ని అందుకుంటున్న నాయకులు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని శ్రీసీతారామస్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం (కొట్టిశ) ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. 462 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్న ఈ సంఘానికి ఎన్నికల అధికారిగా సిహెచ్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో చేతులెత్తే పద్ధతి ద్వారా మంగళవారం ఎన్నిక నిర్వహించారు. ఎన్నికలకు వివిధ గ్రామాలకు చెందిన పలువురు మత్స్యకారులు సభ్యులు పాల్గొన్నారు. అధ్యక్షునితో పాటు ఉపాధ్యక్షుడు మరో ఏడు మంది డైరెక్టర్లుకు సంబంధించి మొత్తం 9 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడం పోటీ లేకుండా ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి సంతోష్ కుమార్ వెల్లడించి ఎన్నికైనట్టు ధృవపత్రాన్ని అందజేశారు. అధ్యక్షుడిగా పెనుబోతు దుర్గారావు, ఉపాధ్యక్షుడిగా మజ్జి గణపతి, డైరెక్టర్లుగా అరసాడ రామయ్య, కొక్కిరిగెడ్డ నరసింహమూర్తి, మల్లేడి తవిటన్నదొర, పిల్లి జాను, కలింగ సూరయ్య, రేగిడి సింహాచలం, సాకేటి గురవయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా వంగర, రేగిడి ఎస్ఐలు షేక్ శంకర్, బాలకృష్ణ పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించారు.

బొబ్బిలి: బొబ్బిలి, పాతబొబ్బిలి మత్స్యకార సొసైటీ ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి. బొబ్బిలి సొసైటీ ఎన్నిక మార్కెట్ యార్డులో, పాతబొబ్బిలి సొసైటీ ఎన్నిక పాతబొబ్బిలి ఆలయంలో నిర్వహించారు.

బొబ్బిలి సొసైటీ అధ్యక్షుడిగా కంచి వెంకటరావు

బొబ్బిలి సొసైటీ అధ్యక్షుడిగా కంచి వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సొసైటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరగ్గ అధ్యక్షుడిగా కంచి వెంకటరావు, ఉపాధ్యక్షులు జి.పైడయ్య, డైరెక్టర్లగా ఎన్. సీతారాం, ఎన్.వేణు, పి.రాము, జి.సత్యనారాయణ, ఎస్.దాలయ్య, ఎన్నికయ్యారు.

పాతబొబ్బిలి సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం

పాతబొబ్బిలి సొసైటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్. శంకరరావు, ఎస్. అప్పారావు, ఉపాధ్యక్షులు ఎస్.రాము, డైరెక్టర్లుగా కె.నూకయ్య, కె. అప్పారావు, జి.గోపాలం, పి.పోలన్నదొర, ఎస్.అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి నియామక పత్రాలను ఎన్నికల అధికారి శ్రీనివాస్ అందించారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న రామారావు

ప్రజాశక్తి - గజపతినగరం

రైతులకు అపరాలు, మొక్కజొన్న పంటల్లో సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు అవగాహన కల్పించారు. మండలంలోని జిన్నా, ముచ్చెర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన పంటలపై నానో యూరియా, నానో డిఎపి వాడకం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలిపారు. ధాన్యం కొనుగోలు విధి విధానాలను ప్రధానంగా స్థానిక అధికారులకు, రైతులకు తెలిపారు. ప్రస్తుత వాతావరణం పరిస్థితులకు అనుగుణంగా వరి కోతలు, అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు ఏ నిర్మల జ్యోతి, ఎఒ కిరణ్‌కుమార్, ఎఇఒ సతీష్, వ్యవసాయ సహాయకులు వినయ్, రైతులు పాల్గొన్నారు.

రబీ సాగు పై అవగాహన

కొత్తవలస: మండలంలోని వీరభద్రాపురం, తుమ్మికాపల్లి రెవెన్యూ గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులకు రబీ పంటల సాగుపై పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎఒ కెవి రామ్‌ప్రసాద్ రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాల ఎంపిక చాలా ముఖ్యమని, అపరాల్లో చాలా వరకు వచ్చే తెగుళ్ల విత్తనాల ద్వారానే సంక్రమిస్తాయని, విత్తనాలు జల్లే ముందే వాటిని విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు ప్రసాద్, మౌనిక, ఎపి సీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇపిఎఫ్ పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

ఇపిఎఫ్ పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్.గోపాలం, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వి.శేషగిరిరావు డిమాండ్ చేశారు. ఇపిఎఫ్ పెన్షన్ రూ. 9వేలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద పెన్షన్ దారులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు నుంచి ఇపిఎఫ్ కింద ఉన్న రూ.25లక్షల కోట్లుకు నెలకు రూ.75వేల కోట్లు వడ్డీ వస్తే పెన్షన్ దారులకు కనీస పెన్షన్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఇపిఎఫ్ సొమ్మును షేర్ మార్కెట్లో పెట్టే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు భుజంగ, టిబి అప్పారావు, పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ఇపిఎఫ్ కనీస పింఛన్ రూ.9వేలు ఇవ్వాలని ఇపిఎఫ్ పింఛన్‌దార్ల సంఘం జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు, మండల నాయకులు మొయిద పాపారావు, కనకల పద్మనాభం డిమాండ్ చేశారు. మంగళవారం వారు కనీస పింఛన్ 9,000 ఇవ్వాలని కోరుతూ తహశీల్దార్ ఆఫీస్ డిటి సత్యానారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తుంటే మోదీ ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఎన్నికల్లో అమలు కాని వాగ్దానాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. కనీస పింఛను 9వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చెస్తున్నట్టు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో టి.అప్పలనరసయ్య ఉన్నారు.

జగనన్న కాలనీకి రహదారి ఏర్పాటు



రోడ్డును పరిశీలిస్తున్న టిడిపి నాయకులు రవిశేఖర్, ఆనంద్

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని కొండవెలగాడలో జగనన్న కాలనీకి టిడిపి నాయకులు దంతలూరి అజయ్‌బాబు, మొయిద సత్యనారాయణ సొంత నిధులతో రహదారి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి సౌకర్యం లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో స్పందించి కాలనికి తమ సొంత నిధులతో రహదారి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రహదారని టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్, నెల్లిమర్ల టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, నెల్లిమర్ల టౌన్ అధ్యక్షులు లెంక అప్పలనాయుడు మంగళవారం పరిశీలించారు. కూటమి నాయకులు, పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జయప్రదం చేయాలి

కొండవెలగాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి 12వ జూనియర్, బాల, బాలికలు, సీనియర్ మహిళ, పురుష అంతర్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను జయప్రదం చేయాలని టిడిపి రాష్ట్ర పరిశీలకులు (విశాఖ నార్త్) సువ్వాడ రవి శేఖర్, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ కోరారు. మంగళవారం కొండ వెలగాడలో వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ వివరాలను వెల్లడించారు. ఈ నెల 14,15,16 తేదీల్లో స్థానిక జడ్‌పి హై స్కూల్‌లో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు జరుగుతాయని వాటిని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి పార్లమెంట్ కార్యదర్శి లెంక అప్పలనాయుడు, టిడిపి నాయకులు దంతలూరి అజయ్‌బాబు, మొయిద సత్యనారాయణ, వాళ్లే నాగరాజు, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ అట్టాడ లక్ష్మము నాయుడు, సెక్రటరీ చల్లా రాము, ఆర్గనైజింగ్ కార్యదర్శి వల్లూరు శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. పరుగులు తీశారు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ నెల 10న సామాజిక కార్యకర్త రిక్కీ అప్పారావు ఇచ్చిన దరఖాస్తుపై అధికారులు స్పందించారు. జిల్లా కోఆర్డినేటర్ ఎం.మాణిక్యం, సామాజిక కార్యకర్త అప్పారావు, ప్రిన్సిపల్ టి.జయశ్రీ, వసతి గృహం సిబ్బంది సమక్షంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను 15 రోజుల్లో పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.

ఆసుపత్రి మార్పునకు పరిశీలన

మండలంలోని బల్లంకి గ్రామంలో శిథిలావస్థకు చేరిన హోమియో ఆసుపత్రి భవనాన్ని వెల్నెస్ సెంటర్ భవనంలోకి మార్పు చేయాలని జిల్లా కలెక్టర్‌కి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 10న ఇచ్చిన దరఖాస్తునకు మూడు రోజుల్లో భవనాన్ని మార్పు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి వేణు మాధవ మంగళవారం పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, సిహెచ్‌ఒ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచ్ గొర్లె నాగ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలపై మాట్లాడుతున్న కోఆర్డినేటర్

వికలాంగుల విద్యకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

సమగ్ర శిక్ష ద్వారా వికలాంగుల విద్యకు ప్రోత్సాహకాలు కల్పిస్తున్నట్లు సహిత విద్యాధికారి సూర్యారావు తెలిపారు. స్థానిక మండల భవిత కేంద్రంలో బొబ్బిలి, తెర్లాం రామభద్రపురం, బాడంగి మండలాల్లో గల 3 నుంచి 18 ఏళ్ల లోపు వికలాంగుల ఉపకరణాల కోసం అలంకో ప్రతినిధి విక్రమ్ మోహనరావు 130 మందికి వైద్య తనిఖీలు నిర్వహించి అవసరాలకు అనుగుణంగా కృత్రిమ అవయవాలు, వినికిడి పరికరాలు, కర్రలు, వీల్‌చైర్లు, ట్రై సైకిల్స్, ఎంఆర్ కిట్స్ వంటి వాటికోసం 96 మందిని గుర్తించారు. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్యా అధికారి సూర్యారావు, రాష్ట్ర స్థాయి పరిశీలకులు డాక్టర్ అమ్మినాయుడు పాల్గొని శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య సహాయ సమన్వయకర్త భారతి, ఎంఇఒ ఆర్.పెంటయ్య, బొబ్బిలి ఎంఇఒ రమేష్, ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, పైడిరాజు, పాపారావు, కళావతి, సునీల్, ఐఈఆర్పీలు రాజేశ్వరి తేజస్విని, రవి, కృష్ణ మోహన్, స్థానిక విద్యాశాఖ సిబ్బంది, వికలాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు

ప్రజాశక్తి - గజపతినగరం

చెక్ బౌన్స్ కేసులో విజయనగరానికి చెందిన నిమ్మకాయల శకుంతలకు న్యాయస్థానం మంగళవారం ఏడాది జైలు శిక్ష విధించింది. పోరాం గ్రామానికి చెందిన కుంచి సన్యాసప్పల నాయుడు విజయనగరం మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన వద్ద అప్పు తీసుకున్న శకుంతల తిరిగి చెల్లించే నిమిత్తం ఇచ్చిన రూ.4,53,000 చెక్ బౌన్స్ కావడంతో, ఆయన కోర్టును ఆశ్రయించారు. నేరం రుజువు కావడంతో, ఆమెకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. జైలు శిక్షతో పాటు, బాధితుడికి మొత్తాన్ని చెల్లించాలని కూడా కోర్టు ఆదేశించింది.

డ్రంకన్ డ్రైవ్ కేసులో వారం రోజులు జైలు

కంటోన్మెంట్: జామి పోలీసు స్టేషను పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపి పోలీసులకు పట్టుబడిన నిందితుడు కొట్టాం గ్రామానికి చెందిన నక్కెళ్ళ ఎర్రినాయుడుకు ఎస్. కోట స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గండి అప్పల నాయుడు 7 రోజుల జైలుశిక్ష విధించినట్లుగా ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. ఎర్రి నాయుడు మద్యం సేవించి జామి నుండి కొట్టాం వైపు స్కూటీని నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారన్నారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన శిక్షలు తప్పవని ఎస్‌పి హెచ్చరించారు.